క్లుప్తంగా

17 నుంచి పాలిసెట్ శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ - 2023 కోసం రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరు గ్రామంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17 నుంచి ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కల విద్యార్థులు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలి.

కాతేరు పార్కులో స్వచ్ఛభారత్

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పిలుపు మేరకు సామాజిక న్యాయవారోత్సవాల్లో భాగంగా మండల ఎస్సీమోర్చా ఉపాధ్యక్షుడు కండెల్లి రామారావు ఆధ్వరంలో గురువారం కాతేరు అంబేడ్కర్ ఉద్యానవనంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రూరల్ అసెంబ్లీ కోకన్వీనర్ యానాపు ఏసు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్విరామంగా అందరూ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా పార్కు పరిసరాలను శుభ్రపరిచి, సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని స్వచ్ఛజలాలతో శుభ్రం చేశారు.

స్కూళ్ల ప్రారంభానికి ముందే జేవీకే కిట్ల పంపిణీ

కడియం: పాఠశాలలు తెరవడానికంటే ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను పంపిణీ చేయాలని కేజీబీవీ డైరెక్టర్ డి.మధుసూదనరావు ఆదేశించారు. గురువారం ఆయన కడియంలోని ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన జేవీకే కిట్లను పరిశీలించారు. ఎంఈవో నేతృత్వంలోని కమిటీ ద్వారా మేలోనే పంపిణీ పూర్తి చేయాలన్నారు. కిట్లను భద్రపరచడం నుంచి సంబంధిత విద్యార్థులకు అందజేసే వరకు పక్కా ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలన్నారు. అనంతరం కడియంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈవో వి.లజపతిరాయ్, ఏఎంవో గౌరీ శంకర్, సీఎండీ నారాయణరెడ్డి ఉన్నారు.

డీసీసీబీ చైర్మన్ పరామర్శ

కడియం: కడియపులంక గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని గురువారం డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, పార్టీ నాయకులు బోడపాటి సత్యనారాయణ, మూర్తి, బొబ్బిలి భాస్కరరావు ఉన్నారు.

నేడు పాదయాత్ర

ప్రకాశం నగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగాన్ని, లౌకిక వ్యవస్థను ప్రధాని మోదీ విచ్ఛిన్నం చేస్తున్నారని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటూ శుక్రవారం చేపడుతున్న పాదయాత్రను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని గురువారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9.30 గంటలకు గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్రను ప్రారంభిస్తామని, అక్కడి నుంచి పశువైద్యశాల, దేవీచౌక్ మీదుగా అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ముగుస్తుందన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణులకు అభినందన

ప్రకాశం నగర్: ఇటీవల గోవాలో జరిగిన జాతీయ మహిళా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఐ.అశ్విని ప్రియ, వై.శాంతిని గురువారం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ తరఫున అభినందించారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ అబేల్ రాజ్ బాబు, ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సుంకర నాగేంద్ర కిషోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీరా గంగాధర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు పీఏ కిషోర్ బాబు, సంజీవ్, రమణ మూర్తి, కోచ్ బి.మణికంఠ పాల్గొన్నారు.

నేడు సమైక్య యాత్ర

రాజమహేంద్రవరం సిటీ: బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను అందరూ ఘనంగా జరపాలని అంబేడ్కర్ సేవాకేంద్రం చైర్మన్, లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు కోరారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవ సమైక్య యాత్ర శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక వై.జంక్షన్ నుంచి ప్రారంభమై గోకవరం బస్టాండ్ వరకూ జరుగుతుందన్నారు.

డయ్యర్ చిత్రపటాల దహనం

సీటీఆర్ఐ: జలియన్ వాలాబాగ్‌లో జరిగిన రక్త చరిత్రకు గురువారంతో 104 ఏళ్లు పూర్తయ్యాయని ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు పెదిరెడ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద గల స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో జలియన్ వాలాబాగ్ ఘటనకు కారకుడైన జనరల్ డయ్యర్ చిత్రపటాలను దహనం చేశారు. కార్యక్రమంలో గ్రంధి రాజా, మాదిరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత పథకాలకు కొత్తపేర్లు

రాజమహేంద్రవరం సిటీ: జగన్ పాలనలో పాత పథకాలకు కొత్త పేర్లు పెట్టి కొనసాగిస్తున్నారని మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. 108కు ఫోన్ చేస్తే అరగంటకు కూడా రావడం లేదన్నారు.

చెత్త సమస్యకు మోక్షమెప్పుడో!

- ధవళేశ్వరంలో డంపింగ్‌యార్డు లేక అవస్థలు
- తలలు పట్టుకుంటున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది


ధవళేశ్వరం గ్రామ పంచాయతీ


కంపోస్టుయార్డు లేక బ్యారేజీ దిగువ వేసిన చెత్త

ధవళేశ్వరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ అయిన ధవళేశ్వరాన్ని కంపోస్టు యార్డు సమస్య వేధిస్తుంది. ఈ గ్రామ శివారు బొమ్మూరుకు చేర్చి ఉన్న కంపోస్టు యార్డులో చెత్త వేయడాన్ని నిలిపివేయడంతో మూడు నెలలుగా గ్రామంలో సేకరించిన చెత్తను వేసేందుకు స్థలం లేక పంచాయతీ అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ప్రతి రోజూ సేకరించిన చెత్తను వేసేందుకు తీవ్ర కసరత్తులు చేయాల్సిన విచిత్ర పరిస్థితి నెలకొంది.

వివరాలు ఇవీ..

ధవళేశ్వరంలో సేకరించిన చెత్తను బొమ్మూరు శివారులో ఉన్న కంపోస్టు యార్డులో వేసేవారు. మూడు నెలలుగా కంపోస్టు యార్డును మూసివేయడంతో సేకరించిన చెత్తను వేసేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలం బ్యారేజీ శివారున చెత్త వేశారు. ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం చెప్పడంతో అక్కడ నిలిపివేశారు. దీంతో మూడు నెలలుగా వివిధ ప్రాంతాల్లో చెత్తను వేస్తూ కాలం వెల్లదీస్తున్నారు.

నిత్యం సేకరణ

ధవళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం ఆరు ట్రాక్టర్లు ద్వారా ప్రతిరోజూ సుమారు 18 ట్రాక్టర్ల చెత్తను సేకరిస్తున్నారు. దీనిని వేసేందుకు మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. దీనిపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు సీతానగరం లేదా లాలాచెరువు ప్రాంతంలోని కంపోస్టు యార్డుకు తరలించాలని యోచిస్తున్నారు. అయితే గ్రామంలో సేకరించిన చెత్తను అంత దూరంలో వేయాల్సి వస్తే పంచాయతీపై అదనపు భారం పడే అవకాశం ఉంది. అలాగే సమయం కూడా ఎక్కువ పడుతుంది.

శాశ్వత పరిష్కారం చూపాలి

ధవళేశ్వరంలో నెలకొన్న కంపోస్టు యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి కంపోస్టు యార్డును ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. లేకుంటే భవిష్యత్తులో పారిశుధ్య నిర్వహణ ప్రధాన సమస్యగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పరిష్కారం

గ్రామంలో నెలకొన్న కంపోస్టు యార్డు సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

– డి.సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

మర్యాదపూర్వకంగా..


జక్కంపూడి విజయలక్ష్మితో విజయ్ ప్రతాప్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి గురువారం స్థానిక ప్రకాశం నగర్ కార్తికేయ అపార్ట్‌మెంట్‌లో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ సమర్థంగా సేవలు నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

16న 'ఖడ్గధారి కందుకూరి' నృత్యరూపకం ప్రదర్శన


నృత్యరూపకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు

ప్రకాశం నగర్: కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం జీవితంపై ఖడ్గదారి కందుకూరి అనే సంగీత నృత్య రూపకం ప్రదర్శిస్తున్నామని కందుకూరి జయంతి నిర్వహణ కమిటీ సభ్యుడు బి.పవన్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కె.దినేష్ కుమార్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 16వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఉచితంగా ఈ ప్రదర్శన జరుగుతుంది.

రాష్ట్రంలో యజ్ఞంలా సంక్షేమ కార్యక్రమాలు

- ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా ఆసరా సంబరాలు


ఆసరా సంబరాల్లో సీఓలను సత్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్


చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలను యజ్ఞంలా అమలు చేస్తున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో 45, 46 డివిజన్లకు చెందిన ఆసరా లబ్ధిదారులతో గురువారం క్వారీ సెంటర్ శివాలయం వద్ద వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు జగనన్న మహాసంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పేదలను గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందించడంతో పూర్తి పారదర్శకత పాటిస్తున్నారన్నారు. తెలుగుదేశం పాలనలో పథకం అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూతిరిగే దుస్థితి ఉండేదన్నారు. జగనన్న పాలనలో ఎవరి జోక్యం లేకుండా పథకాలు అందుతున్నాయన్నారు. పేద మహిళలు ఆర్థికంగా చైతన్యవంతులు కావాలన్నదే జగనన్న ఆశయమన్నారు. 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చి ఆశీస్సులు అందజేయాలన్నారు. అనంతరం 12 మంది సీఓలు, ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిటీ మిషన్ మేనేజర్ రవిశంకర్‌ను ఎంపీ సత్కరించారు. ఆసరా లబ్ధిదారులకు నమూనా చెక్ అందజేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, పార్టీ నాయకులు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, పాలిక శ్రీను, పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ గురువారం ప్రారంభించారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, శ్రీ పీఎంకే చౌల్ట్రీ ఈఓ వీవీ పల్లంరాజు, సూపరింటెండెంట్ డి.సురేష్ బాబు, బీహెచ్ మూర్తి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గుర్రం గౌతమ్, వైఎస్సార్ సీపీ నగర యువజన అధ్యక్షుడు పీతా రామకృష్ణ, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మార్గాని సురేష్, అన్నవరం ట్రస్టుబోర్డు మెంబర్ కడియాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

23న బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశం

సీటీఆర్ఐ: వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు కేటాయించిన రాజకీయ పార్టీకే తమ మద్దతు ఉంటుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగం అధ్యక్షురాలు, రాష్ట్ర ఇన్‌చార్జి వెలగల నూకాలమ్మ తెలిపారు. వీఎల్ పురంలోని గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్లో గురువారం విలేకరులతో మాట్లాడారు. బీసీలకు జరుగుతున్న అన్యాయం, దాడులు, రావాల్సిన వాటాను దక్కించుకునేందుకు చేయాల్సిన కార్యాచరణపై ఈనెల 23న రాజమహేంద్రవరంలో జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కన్వీనర్ లాకా వెంగళరావు, వై.నాగేశ్వరరావుతో పాటు 8 రాష్ట్రాల నుంచి బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు సుమారు 1500 మంది వరకు హాజరవుతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సమావేశం రాజమహేంద్రవరంలో జరుగుతుందని, ఆ తర్వాత శ్రీకాకుళం, విజయవాడ, తిరుపతి, కర్నూలు ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో బీసీ యువజన విభాగం నాయకులు లద్దిక మల్లేష్, మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ నరవ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మాభవిష్యత్తు'


రాజవోలులో పోస్టర్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్


రాజేంద్రనగర్‌లో వృద్ధురాలికి పథకాలు వివరిస్తున్న బొంతా శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం ఇంటింటా ఘనంగా జరుగుతోంది. సీఎం జగన్ పాలనకు ప్రజలందరూ మద్దతు తెలుపుతూ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో గురువారం జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలంలోని గ్రామాలతో పాటు నగరపాలకసంస్థ పరిధిలోని డివిజన్లలో ఇంటింటికీ వెళ్లారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు తేడాను వివరించారు. సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులు తమ ఇంటి తలుపులకు, మొబైల్ ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించుకున్నారు. జేసీఎస్ కన్వీనర్లు కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు (రాజమౌళి), తాటికొండ విష్ణుమూర్తి, తాడాల చక్రవర్తి పర్యవేక్షించారు.

ప్రతి గుమ్మానికి సంక్షేమమే లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ: పేదరికంతో ఉన్న ప్రతి గుమ్మానికి సంక్షేమ పథకాలు అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాలుగో డివిజన్ ఇన్‌చార్జి బొంతా శ్రీహరి అన్నారు. రాజేంద్రనగర్‌లో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో సీఎం జగన్ దేశంలో మొదటి స్థానంలో ఉన్నారన్నారు.

ఏటీఎం కార్డు మార్చి మోసం

ధవళేశ్వరం: గ్రామంలోని శివాలయం వీధికి చెందిన పొక్కులూరి వెంకట శ్రీరామమూర్తి తన కుమార్తెకు సొమ్ము డిపాజిట్ చేసేందుకు స్థానిక ఎస్‌బీఐ ఏటీఎమ్ వద్దకు ఉదయం 11 గంటల సమయంలో వచ్చాడు. అతడికి అక్కడే ఉన్న సుమారు 30 ఏళ్ల వ్యక్తి సహాయం చేస్తున్నట్లు నటించి ఏటీఎమ్ కార్డును మార్చాడు. కొంత సమయానికి రూ.10 వేలు చొప్పున రెండు సార్లు డ్రా చేసినట్లు మేసేజ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించిన వెంకట శ్రీరామమూర్తి ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వి.క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

రాజమహేంద్రవరం సిటీ: అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప రెడ్డి అన్నారు. నగరంలోని గొల్లవీధి మంగళవారపు పేట, శానిటోరియం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

అంతరపంటగా కోకో సాగు లాభదాయకం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో మొక్కలు పెంచడం లాభదాయకమని ప్రముఖ చాక్లెట్ టేస్టర్ నితిన్ కార్డియా అన్నారు. స్థానిక సీటీఆర్ఐ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన కోకో వాల్యూ చైన్‌పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నితిన్ కార్డియా మాట్లాడుతూ మన కోకో రైతులు అంతర్జాతీయ ప్రమాణాలకు సరితూగే గింజలు (కోకో బీన్స్) తయారు చేయలేకపోతున్నారన్నారు. 16 టన్నుల బీన్స్ ఉత్పత్తి చేసే ఫెర్మెంటేషన్ యూనిట్ ఏర్పాటుకు రూ.28 లక్షలు ఖర్చు కాగా, ఇందులో 35 శాతం ప్రభుత్వ రాయితీ ఇస్తుందన్నారు. పది శాతం రైతు పెట్టుబడి కాగా, మిగిలిన దానిని బ్యాంకు రుణ సదుపాయం అందిస్తుందన్నారు. ఆసక్తి ఉన్నవారు కనీస స్థాయిలో రూ.10 లక్షల్లో చాకోలెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజర్స్ పథక సంచాలకులు సుభాష్ కిరణ్ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన రైతులు, రైతు సంఘాలు ఈ పద్ధతుల గురించి, ప్రభుత్వ సహకారం గురించి మరింత సమాచారం కొరకు ఫుడ్ ప్రాసెసింగ్ జోనల్ మేనేజర్ కేజే మారుతీ 78933 47474ని సంప్రదించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.రామ్మోహన్, సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత, జిల్లా హార్టికల్చర్ అధికారి బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

దాత భాస్కరరెడ్డికి సత్కారం


సత్తి భాస్కరరెడ్డిని సత్కరిస్తున్న మంత్రి వేణు, చిత్రంలో చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు

కడియం: ప్రముఖ దాత, ఆదర్శరైతు అవార్డు గ్రహీత సత్తి భాస్కరరెడ్డి (కందరెడ్డి)ని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్ రామ్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ఘనంగా సత్కరించారు. మండలంలోని వీరవరంలో నూతనంగా నిర్మించిన పార్కు, అంబేడ్కర్ విగ్రహాలను భాస్కరరెడ్డి సమకూర్చగా, వైఎస్సార్ విగ్రహాన్ని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అందజేశారు. ఈ నేపథ్యంలో దాతలకు వీరవరం అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో సత్కారం చేశారు. భాస్కరరెడ్డి స్వగ్రామమైన దుళ్లలోని ఆయన ఇంటి నుంచి గారడీ కళాకారులు, పూలు చల్లుతూ వీరవరం తీసుకువెళ్లి తమ అభిమానం చాటుకున్నారు. అలాగే సభా వేదికపై గజమాలతో సత్కరించారు. ప్రారంభోత్సవం అనంతరం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'గడపగడపకూ'


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. 46వ డివిజన్ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో గురువారం ఆనందనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ స్థానికంగా పారిశుధ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తెలపగా, సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంహెచ్‌ఓ వినూత్నకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పీతా రామకృష్ణ, తిరగాటి దుర్గ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కంబాలచెరువు: స్థానిక రాజమహేంద్రి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో సాక్ష్యం 2023 కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓఎన్‌జీసీ జీఎం సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ రాబోయే కాలంలో అందరూ ఎలక్ట్రికల్ వైపు ఎక్కువగా మొగ్గుచూపే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సహజ వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ తేతలి సత్య సౌందర్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు రెండు అవార్డులు

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో వివిధ సంస్థలు చేసే ఉత్తమ ప్రాజెక్టులు, ఉత్తమ ఆవిష్కరణలను గుర్తించి ఇచ్చే అవార్డులను రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ దక్కించుకుంది. ప్రతి సంవత్సరం స్కాచ్ గ్రూప్ సంస్థ ఈ అవార్డులు అందజేస్తుంది. వీటిలో దేశంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు పాల్గొంటాయి. ఈ ఏడాది జరిగిన అవార్డు పోటీలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ తరఫున రెండు నామినేషన్లు (స్వచ్ఛ తోయకథాన్, ఎస్తెటిక్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ గార్బేజ్ వానెరబుల్ పాయింట్) నమోదు చేశారు. ఈ రెండింటికీ స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు వచ్చి, సెమీఫైనలిస్ట్‌గా నిలిచింది. అనంతరం వివిధ రౌండ్‌లలో సిటిజన్ ఓటింగ్, స్కాచ్ జ్యూరీ ఓటింగ్ జరిగాయి. కమిషనర్ కె.దినేష్ కుమార్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఏ.వినూత్న ఆన్‌లైన్‌లో జ్యూరీ జడ్జెస్‌కి ప్రెజెంటేషన్ ఇచ్చారు.

సంస్కృతభాషకు విశిష్ట స్థానం

రాజానగరం: సంస్కృతానికి ప్రపంచభాషలలో ఒక విశిష్ట స్థానం ఉందని, అన్ని భాషలకు ఇది మూలమని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. వల్లీమాధవి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంస్కృత భాష, విశిష్టతలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ ఆ కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వల్లీమాధవి మాట్లాడుతూ గ్రీకు, లాటిన్, గౌతిక్ తదితర భాషలన్నీ భిన్నకాలంలో సంస్కృతం నుంచే ఉద్భవించాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ ఏ.మాధవీ కామేశ్వరి పాల్గొన్నారు.